సాక్షి తిరుపతి

ఆదివారం । 9 । మార్చి । 2025



అంగన్‌వాడీల్లో అలజడి

అంగన్‌వాడీల్లో అలజడి మొదలైంది. అధికారులు, నేతలు బెదిరింపులకు దిగడం విమర్శలకు తావిస్తోంది. - 8లో



డివైడర్‌ను ఢీకొన్న కారు

నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి తాళ్వాయి పాడు వద్ద కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సా)	సహర్ సోమవారం (ఉ)
తిరుపతి	6-25	5-04
గూడూరు	6-19	5-01

న్యూస్‌రీల్

రేపు ఐటీఐలో అప్రెంటిస్‌షిప్ మేళా

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుచానూరు రోడ్డు, పద్మావతీపురంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రధాన మంత్రి జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నారు. ఆ మేరకు ప్రిన్సిపాల్, కన్వీనర్ వి.శ్రీలక్ష్మీ ఒక ప్రకటన విడుదల చేశారు. ఇందులో తిరుపతి జిల్లా వ్యాప్తంగా వున్న గుర్తింపు పొందిన పరిశ్రమల ప్రతినిధులు హాజరై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అలాగే ఆయా కంపెనీల్లో అప్రెంటీస్ ఏర్పాటుచేయనున్నట్టు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలో ఉత్తీర్ణులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు అప్రెంటీస్‌షిప్ సలహాదారు సి.గంగాధరంను 94416 47174, 95337 17170 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

లక్ష్య సాధనకు నిబద్ధతతో పనిచేయాలి



మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ ఉమ

తిరుపతి సిటీ: మహిళలు ఉన్నత లక్ష్యసాధనకు నిబద్ధతతో అడుగు ముందుకు వేయాలని, అప్పుడే విజయం సొంతమవుతుందని మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పేర్కొన్నారు. పద్మావతి మహిళా వర్సిటీ, మహిళా అధ్యయన కేంద్రం సంయుక్తంగా వే ఫౌండేషన్ సహకారంతో శనివారం సావేరి సెమినార్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా దినోత్సవం 2025 థీమ్ ఫర్ ఆల్ విమెన్ అండ్ గర్ల్స్ రైట్స్, ఈక్వాలిటీ, ఎంపవర్‌మెంట్ అనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. స్విమ్స్ కార్డియాలజిస్ట్ ప్రొఫెసర్ వి.వనజాక్షమ్మ మహిళల ఆరోగ్య సంరక్షణపై వివరించారు. కార్యక్రమంలో డీన్ కొలకలూరి మధుజ్యోతి, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, సుధారెడ్డి, మాజీ వైస్ వీసీ ప్రొఫెసర్ దుర్గా భవాని, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ గీతావాణి, వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్య, మహిళా అధ్యయన శాఖ ఇన్‌చార్జి డాక్టర్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 10 గంటలు

తిరుమల: తిరుమలలో శ్రీవారి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో 9 కంపార్ట్‌మెంట్లు నిండాయి. శుక్రవారం అర్ధరాత్రి వరకు 67,127 మంది స్వామివారిని దర్శించుకోగా 22, 910 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.47 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాన్ని కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

మహిళా దినోత్సవ ర్యాలీ



మహిళా దినోత్సవం సందర్భంగా తిరుపతిలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎస్పీ కార్యలయం నుంచి బాలాజీ కాలనీ సర్కిల్ వరకు ర్యాలీ సాగింది. అదనపు ఎస్పీ కేవీ.రవిమనోహరాచారి, డీఎస్పీ లత, సీఐలు మురళీమోహన్‌వు (వెస్ట్), రామయ్య (ఎస్వీయూ), శ్రీరాములు (పీజీఆర్ఎస్), మహిళా పీఎస్ ఎస్ఐ దీపిక, ట్రాఫిక్ ఎస్ఐ విజయలక్ష్మి, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సోమశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. – తిరుపతి క్రైం

ఆ శక్తి రూపమె!

శ్రీసిటీలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. షార్ మహిళా శాస్త్రవేత్తలు, శ్రీసిటీ మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు. శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో నిర్వహించిన వేడుకలను మమతా సన్నారెడ్డి, తిరుపతి ఏఎస్పీ జెహెచ్ విమలకుమారి, సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం షార్ సీనియర్ సైంటిస్ట్ లత ప్రారంభించారు. అనంతరం మహిళలను సత్కరించారు. శ్రీసిటీ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి పాల్గొని ప్రసంగించారు.

– సత్యవేడు



మహిళా సాధికారితే లక్ష్యం




మహిళా సాధికారితే లక్ష్యమని కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తిరుపతి కచ్చపి ఆడిటోరియం వేదికగా జిల్లా స్థాయి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం తిరుపతి కమిషనర్ మౌర్యను ఆత్మీయంగా సత్కరించారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్డీఓ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. – తిరుపతి తుడా

- ఇటీవల తిరుపతిలోని ఓ ప్రైవేటు కళాశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు వంద మందికిపైగా రక్తదానం చేసేందుకు యువత ముందుకొచ్చారు. వైద్య బృందం రక్త పరీక్షలు నిర్వహించగా సుమారు 31 మందికి మధుమేహ లక్షణాలు బయటపడ్డాయి. ప్రారంభదశలో ఉన్న నేపథ్యంలో జాగ్రత్త వహించాలని ఆ విద్యార్థులకు వైద్యులు సలహాలు, సూచనలు అందించారు.
- తిరుపతిలోని ఓ ప్రముఖ విద్యాసంస్థలో ఇంజినీరింగ్ చేస్తున్న యువకుడు బర్త్‌డే పార్టీ అంటూ స్నేహితులను పిలిచి మందు పార్టీ ఇచ్చాడు. అందులో ఓ స్నేహితునికి మరుసటిరోజు తల తిరగడం, శరీరం నీరసించడం, అధికదాహం, తరచూ మూత్ర విసర్జనతో మంచం పట్టాడు. తల్లిదండ్రులు ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించారు. రిపోర్టులో మధుమేహ లక్షణాలు కనపడ్డాయి. షుగర్ 240 మార్కును దాటింది. వంశపారంపర్యంగా షుగర్ లక్షణాలు కుటుంబంలో ఎవరికీ లేకపోవడం, వయస్సు 20ఏళ్లు మాత్రమే ఉండడంతో వైద్యుడు మరిన్ని పరీక్షలు నిర్వహించి ఫ్యాటీ లివర్, కొలెస్ట్రాల్, కిడ్నీలో ఇన్ఫెక్షన్ ఉన్నట్టు తేల్చారు. ఆల్కహాల్ ప్రభావం యువకుడిపై తీవ్ర ప్రభావం చూపినట్టు వెల్లడించారు.

.. ఇవి మచ్చుకు రెండు ఘటనలు మాత్రమే. తిరుపతి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి. చిన్నతనంలోనే మద్యానికి బానిసై దీర్ఘకాలిక వ్యాధులబారిన పడుతున్నారు. తల్లిదండ్రులకు తీరని వ్యథలు మిగుల్చుతున్నారు.

చుక్క తాగి.. చక్కెరొచ్చెరో!



జిల్లా సమాచారం

18-40 ఏళ్ల లోపు వారు
10 లక్షల మంది

ఉన్నత చదువులు చదువుతున్న వారు
7 లక్షల మంది

వీరిలో మద్యానికి బానిసైన వారు
55 శాతం మంది

నిత్యం మద్యం సేవించేవారు
25 శాతం మంది

షుగర్ వ్యాధిన బారిన పడుతున్న వారు
30 శాతం మంది

మద్యం ఫ్యాషన్‌కు కొలమానం కాదు.. ప్రాణాంతకం

SUNDAY SPECIAL

- మద్యానికి భానిసవుతున్న యువతను ముంచేస్తున్న చక్కెర వ్యాధి
- ప్రతి 100 మందిలో 30 మందికి షుగర్ వ్యాధి లక్షణాలు
- ఆల్కాహాల్ అధికమోతాదే కారణమంటున్న వైద్యులు
- మద్యం సేవించే యువతుల గర్భాశయంపైనా తీవ్ర ప్రభావం చూపే అవకాశం
- తప్పతాగితే శరీర అవయవాలకు ముప్పు తప్పదంటున్న నిపుణులు

తిరుపతి సిటీ: యువకులే దేశ ఆస్తి. అలాంటి యువతరం నేడు మద్యానికి బానిసలై బంగారు భవితను బుగ్గిపాలు చేసుకుంటున్నారు. మద్యం సేవించడం ఫ్యాషన్‌గా మార్చుకుంటున్నారు. తమకు తెలియకుండానే దీర్ఘకాలిక వ్యాధులను కొనితెచ్చుకుంటున్నారు. జిల్లాలో 18 నుంచి 30 ఏళ్లలోపు యువకులు సుమారు 10 లక్షలకు పైగా ఉన్నారు. ఇందులో మద్యానికి బానిసలై టైప్–2 మధుమేహానికి 30 శాతం మంది గురైనట్టు వైద్యనిపుణులు అంచనా వేశారు. చెడు సహవాసం, తల్లిదండ్రుల పర్యవేక్షణా లోపం, సోషల్ మీడియా ప్రభావమే ఇందుకు ప్రధాన కారణాలని చెబుతున్నారు.

మహిళలు తక్కువ తీసుకున్నా ముప్పే



మహిళలు, విద్యార్థినులు కొందరు తప్పటడుగులు వేస్తున్నారు. ఆల్కహాల్ సేవించి చిన్న వయస్సులోనే షుగర్ వ్యాధి భారిన పడుతున్నారు. తక్కువ తీసుకున్నా ముప్పు తప్పదు. ఆల్కహాల్ ప్రభావం ప్రెగ్నెన్సీపై పడుతుంది. గర్భందాల్చినా రిస్క్ ఫేస్ చేయాల్సిందే. పిండం ఎదుగదల లేకపోవడం, ఆల్కహాల్ ప్రభావంతో అబార్షన్లు అవడం ఎక్కువ. ఫెటల్ ఆల్కహాల్ సిండ్రోమ్‌తో పుట్టే బిడ్డ అంగవైకల్యంతోనూ, వినికిడిలోపం, బుద్ధిమాంద్యంతో జన్మించే అవకాశం ఎక్కువ. – డాక్టర్ నీలిమ, ప్రముఖ గైనకాలజిస్ట్, తిరుపతి

ఆల్కాహాల్‌కు దూరంగా ఉండాలి



దప్పిక ఎక్కువగా ఉండడం, ఫంగల్ ఇన్‌ఫెక్షన్, బరువు తగ్గడం, చూపు మందగించడం వంటివి యువతలో ఎక్కువగా కనబడుతున్న మధుమేహ లక్షణాలు. వంశపారంపర్యంగా షుగర్ వ్యాధి యువతలో కనబడటం తక్కువ. కనీసం 35ఏళ్ల దాటిన వారిలో వంశపారంపర్య మధుమేహ లక్షణాలు ఎక్కువగా కనబడతాయి. కానీ నేటి యువతరంలో కొందరు ఆల్కాహాల్‌కు బానిసవుతున్నారు. నెలల వ్యవధిలోనే షుగర్ వ్యాధి భారినపడుతున్నారు. ఆల్కాహాల్ సేవించడాన్ని యువత పూర్తిగా మానుకోవాలి. – డాక్టర్ హారిక, జనరల్ ఫిజీషియన్, తిరుపతి

ఫ్యాషన్‌తో ప్రారంభం.. బానిసలుగా మారుతున్న యువతరం



తిరుపతి వంటి పట్టణ ప్రాంతాల్లో విచ్చల విడి మద్యం షాపులకు తోడు పలు ప్రాంతాల నుంచి ఉన్నత విద్యను అభ్యసించేందుకు స్నేహితులతో కలసి ఉంటున్నారు. దీంతో పార్టీల పేరుతో మద్యం సేవించడం వ్యసనంగా మారింది. కళాశాల మెట్లు ఎక్కిన యువకులు బీర్లు, బీజర్, ఆల్కాహాల్‌తో చిల్ అవుతున్నారు. దీని ప్రభావం శరీర అవయవాలపై పడుతోంది. చిన్న వయస్సులోనే షుగర్ వ్యాధి భారిన పడుతున్నారు. యువతలు కూడా ఆల్కాహాల్‌కు బానిసలవుతున్నారు.

మెదడుపైనా తీవ్ర ప్రభావం



యువతరం మద్యానికి బానిసైతే మేధోశక్తిని కోల్పోతారు. మెదుడులోని నరాలపై తీవ్ర ప్రభావం పడి ఏకాగ్రత క్షీణిస్తుంది. బుద్ధిమాంద్యానికి లోనై మెంటల్‌గా వ్యవహరించే ప్రమాదం లేకపోలేదు. కాళ్లు, చేతుల కండరాలు బలహీన పడుతాయి. ఊబకాయం ఏర్పడి నడవలేని పరిస్థితికి చేరుకుంటారు. షుగర్ అధికమై న్యూరో పేషెంట్లుగా మారుతారు. లివర్, కిడ్నీలు, పేగులపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

– డాక్టర్ రాజశేఖర్, న్యూరాలజిస్ట్, తిరుపతి

యుక్త వయసులోనే మధుమేహం



ప్రస్తుతం యుక్త వయసులో కూడా టైప్–2 డయాబెటిస్ శాతం అధికంగా శోకుతున్నట్టు ప్రాసజ్ఞలెక్క పరిశోధనలో తేలింది. ఆహార అలవాట్లతో పాటు మానసిక ఒత్తిడికి గురికావడం ప్రధాన కారణంగా కనుక్కున్నారు. అధిక శాతం మత్తు పానియాలకు బానిసవడం తద్వారా శరీరంలోని ఇన్సూలిన్ హార్మోన్ పనితీరు పూర్తిగా లోపించడం కారణంగా యుక్త వయసులో వారికి కూడా ఈ మధుమేహం వ్యాపిస్తున్నట్టుగా పరిశోధనలో తేలింది. – డాక్టర్ జ్యోతికుమార్, ఆయుష్ వైద్య నిపుణులు, తిరుపతి

ఇంటర్ పరీక్షకు 651 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా 86 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రథమ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్–1బి, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు జనరల్‌లో 28,981 మంది, ఒకేషనల్‌లో 1,357 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా జనరల్‌లో 552 మంది, ఒకేషనల్‌లో 99 మంది గైర్హాజరయ్యారని ఆర్ఐవో జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్–2బి, జువాలజీ, హిస్టరీ సబ్జెక్టుల్లో పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

14న స్విమ్స్‌లో వాక్ ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి తుడా: స్విమ్స్‌లో అడహక్ బేసిస్ కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 38 సీనియర్ రెసిడెన్స్ పోస్టులకు ఈనెల 14వ తేదీన వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా తెలిపారు. హిందూ మతానికి సంబంధించిన వారు మాత్రమే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. అర్హులైన అభ్యర్థులను రిజర్వేషన్, ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు స్విమ్ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

మెగా కార్పొరేట్ క్రికెట్ లీగ్ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎన్టీఆర్ స్టేడియంలో మెగా కార్పొరేట్ క్రికెట్ లీగ్ టీ–20 టోర్నమెంట్‌ను శనివారం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ప్రారంభించారు. పది జట్లకు పైగా పాల్గొంటున్న ఈ టోర్నీలో తొలిరోజు కలెక్టర్ టీమ్, పోలీస్ టీమ్ తలపడ్డాయి. కలెక్టర్ మాట్లాడుతూ మానసిక, ఆరోగ్య సంరక్షణలో క్రీడలు ఎంతో ఉపకరిస్తాయన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

మహిళా పక్షపాతి జగనన్న



సమావేశానికి హాజరైన మహిళలు, భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి



కేక్ కట్‌చేస్తున్న మేయర్ శిరీష, మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి తదితరులు

- ఆయన పాలనలోనే మహిళలకు సముచిత స్థానం
- కూటమి ప్రభుత్వంలో అరాచకాలు, అత్యాచారాలు
- మహిళా దినోత్సవంలో వక్తలు

తిరుపతి మంగళం : మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీష, ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి కొనియాడారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహిళలకు పంచిపెట్టారు. మేయర్ శిరీష మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో పేదల సంక్షేమం, మహిళాభ్యున్నతి కోసం కృషి చేసిన ఏకైక నాయకుడు జగనన్న మాత్రమేనన్నారు. మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పించి అన్ని రంగాల్లో ఉన్నత స్థానాన్ని కల్పించారని కొనియాడారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాధవి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ఆలోచనతో మహిళలకు అన్ని రకాలుగా తోడున్న నాయకుడు జగనన్న అన్నారు. కార్పొరేటర్ ఆరణి సంధ్య మాట్లాడుతూ జగనన్న పాలనలో మహిళలు మహారాణులుగా జీవించారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలు అణిచివేతకు గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అరాచకాలు, అత్యాచారాలు పెరిగిపోయాయని వాపోయారు. డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో మహిళా కార్పొరేటర్లు అని చూడకుండా తమపై దాడులకు తెగబడ్డారని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ పథకాల్లో ఏ ఒక్కటైనా నెరవేర్చారా? అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆదిలక్ష్మి, పుణీత, శాలిని, శ్రావణి, ప్రముఖ రచయిత మస్తానమ్మ, మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వర్సెస్ మాజీ ఎమ్మెల్యే!

ఓటేరు చెరువు కోసం శ్రీకాళహస్తి టీడీపీ నేతల మధ్య వార్

- రూ.కోట్ల విలువచేసే చెరువును ఆక్రమించారని ఎమ్మెల్యే బొజ్జల ధ్వజం
- ఎమ్మెల్యేపై మండిపడిన మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు
- తిరుపతి సమీపంలోని చెరువు చుట్టూ కూటమి నేతల రాజకీయం



సాక్షి ప్రతినిధి, తిరుపతి: చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో ఉన్న ఓటేరు చెరువు విషయమై కూటమి ప్రభుత్వంలోని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మధ్య వర్గ పోరు తారాస్థాయికి చేరింది. ఒకరిపై మరొకరు దుమ్మెత్తి పోసుకుంటున్నారు. చంద్రగిరి నియోజకవర్గం, తిరుపతి రూరల్ మండలం, అవిలాల గ్రామ సమీపంలో ఓటేరు చెరువు ఉంది. ఈ చెరువుపై వివాదం తలెత్తడంతో జలపరిరక్షణ సమితి న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 36.34 ఎకరాల విస్తీర్ణం ఓటేరు చెరువుదేనని 2006లో ప్రభుత్వం నిర్ధారించినట్లు, 2013 అక్టోబర్‌లో ఏపీ హైకోర్టు సదరు భూమిని ప్రభుత్వ చెరువుగా ఉత్తర్వులు ఇచ్చినట్లు జలపరిరక్షణ సమితి వారు చెబుతున్నారు. ఇదే చెరువుపై గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనూ వివాదం తలెత్తింది. ఆ తరువాత ఓటేరు చెరువులోకి ఎవ్వరూ అడుగుపెట్టలేదు. తాజాగా మూడు రోజుల క్రితం కొందరు గుర్తుతెలియని వ్యక్తులు భారీ వాహనాలతో మట్టి తీసుకొచ్చి చెరువుని పూడ్చివేసే ప్రయత్నాలు ప్రారంభించారు. విషయం తెలుసుకున్న స్థానికులు అడ్డుకున్నారు. సీపీఐ, సీపీఎం నేతలు ఆందోళనలకు దిగారు.

శ్రీకాళహస్తి కూటమి నేతల మధ్య వార్

ఓటేరు చెరువు ఆక్రమణకు గురవుతోందని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి రెండు రోజుల క్రితం అసెంబ్లీలో ప్రస్తావించారు. దీనివెనుక శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు హస్తం ఉందని పరోక్షంగా ప్రస్తావించారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే స్పందించారు. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎమ్మెల్యే బొజ్జలపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. పనిలో పనిగా.. అవిలాల సర్వే నం.376లో 12.45 ఎకరాలు ఓటేరు చెరువు అని, సర్వే నం.370లో 6.70 ఎకరాలు కాలువ ఉందని, సర్వే నం.377లో 17.18 ఎకరాలు రైతుల భూమి ఉందని చెప్పుకొచ్చారు. మాజీ ఎమ్మెల్యే విమర్శలపై శ్రీకాళహస్తి టీడీపీ నేతలు మండిపడుతున్నారు. వరుసగా ప్రెస్ మీట్లు పెట్టి ఎస్సీవీ నాయుడుపై విమర్శలు చేయడం ప్రారంభించారు.

ఆ చెరువుకి.. ఈ ఇద్దరికీ సంబంధం ఏంటి?

ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు ఇద్దరిదీ శ్రీకాళహస్తి సొంత నియోజకవర్గం. చంద్రగిరి నియోజకవర్గంలో ఉన్న ఓటేరు చెరువుకు వీరిద్దరికీ ఏమిటి సంబంధం అని జిల్లాలో చర్చ సాగుతోంది. ఓటేరు చెరువు ఆక్రమణల వెనుక ఎస్సీవీ నాయుడు ఉన్నారని పరోక్షంగా ప్రస్తావించిన ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి.. చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన ముఖ్య టీడీపీ నేత హస్తం ఉందని సీపీఐ, సీపీఎం నేతలు ఆరోపిస్తున్నారు. ఎస్సీవీ నాయుడికి కూటమి ప్రభుత్వంలో ఎటువంటి ప్రయోజనం జరగకుండా ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అడ్డుపడుతున్నారని ఆయన వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. ఎస్సీవీకి ప్రయోజనం చేకూరితే.. భవిష్యత్‌లో తనకు ఇబ్బందులు తప్పవని ఎమ్మెల్యే బొజ్జల లోచన చేస్తున్నట్టు ఆయన వర్గీయులు ఆరోపిస్తున్నారు. మొత్తంగా ఓటేరు చెరువు వివాదం శ్రీకాళహస్తి కూటమి నేతల మధ్య చిచ్చురేపింది.

క్లుప్తంగా

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తిరుపతి క్రైం: శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ రైల్వే గేట్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకుంది. ఎస్వీ యూనివర్సిటీ పోలీసుల కథనం.. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి పద్మావతి డిగ్రీ కాలేజ్ సమీపంలో ఉన్న రైల్వే గేట్ వద్ద మృతిచెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

ట్రెక్కింగ్‌కు అనుమతుల్లేవ్!


చిన్నబాబు, డీఆర్వో

చంద్రగిరి: పనపాకం రేంజ్‌తో పాటు చంద్రగిరి పరిసర ప్రాంతాల్లో అటవీ ఏనుగులు సంచరిస్తున్నాయని, అనుమతులు లేకుండా ఎవరైనా అడవుల్లోకి ప్రవేశిస్తే చర్యలు తప్పవని పనపాకం రేంజ్ డీఆర్‌ఓ చిన్నబాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అడవుల్లో సంచరించడం, ట్రెక్కింగ్‌ను పూర్తిగా నిషేధించినట్లు ఆయన పేర్కొన్నారు.

అంగన్‌వాడీల్లో అలజడి

బెదిరింపులకు దిగుతున్న నేతలు, అధికారులు

- విజయవాడలో రేపు మహా ధర్నా
- ధర్నాకు వెళితే చర్యలు తప్పవంటూ హెచ్చరికలు
- ముందస్తు అరెస్టులకు సర్కార్ సిద్ధం

తిరుపతి అర్బన్: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లలో అలజడి రేగింది. సమస్యలపై ఈనెల 10వ తేదీన విజయవాడలో జరిగే ధర్నాకు వెళ్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఒత్తిడి చేస్తున్నారు. ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగానే ఇంటివద్దే అరెస్టులు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్నారు. ఓ వైపు ఉన్నతాధికారుల నుంచి.. మరోవైపు పోలీసుల నుంచి అంగన్‌వాడీలకు ఒత్తిడి తప్పడం లేదు. దీంతో వారంతా ఆందోళన చెందుతున్నారు. అయితే తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం విజయవాడ ధర్నాకు వెళ్లి తీరుతామని స్పష్టం చేస్తున్నారు.

ప్రతిపక్షంలో అలా....అధికారంలో ఇలా

ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబునాయుడు అంగన్‌వాడీలకు చెందిన అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. అంతేకాదు అప్పట్లో నారా లోకేష్ సమస్యలపై ధర్నాలు చేసుకుంటే తాము అడ్డురామని చెప్పిన విషయాలను అంగన్‌వాడీ కార్యకర్తలు గుర్తుచేస్తున్నారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ధర్నాకు వెళ్లకుండా బెదిరింపులకు పాల్పడడంపై పలువురు మండిపడుతున్నారు.

11 ప్రాజెక్టుల్లోనూ బెదిరింపులు

జిల్లాలో 11 అంగన్‌వాడీ ప్రాజెక్టులు ఉన్నాయి. ఆ ప్రాజెక్టు అధికారుల నుంచి అంగన్‌వాడీ టీచర్లతో పాటు హెల్పర్లకు ఒత్తిడి తప్పడం లేదు. సాధారణంగా ప్రతి నెలా 25వ తేదీపైన సెక్టార్ మీటింగ్ నిర్వహిస్తుంటారు. అయితే విజయవాడలో రాష్ట్ర స్థాయి ధర్నాకు అంగన్‌వాడీలు పిలుపునివ్వడంతో మార్చి 10న సెక్టార్ మీటింగ్ ఉందంటూ ఆయా ప్రాజెక్టుల పరిధిలోని సీడీపీవోలు సమాచారం ఇవ్వడం విమర్శలకు తావిస్తోంది.


అంగన్‌వాడీ కార్యకర్తలు (ఫైల్)

జిల్లా సమాచారం

అంగన్‌వాడీ ప్రాజెక్టుల సంఖ్య	11
అంగన్‌వాడీ సెంటర్లు	2,492
అంగన్‌వాడీ మెయిన్ సెంటర్ల కార్యకర్తలు	2,092
అంగ్‌వాడీ మినీ సెంటర్ల కార్యకర్తలు	348
అంగన్‌వాడీ హెల్పర్లు	2,066

పోరాటం తప్పదు



అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెల కోసం పోరాటం చేయాలని భావించాం. అందులో భాగంగా రాష్ట్ర స్థాయిలో ఈనెల 10వ తేదీన విజయవాడలో ధర్నా నిర్వహించనున్నాం. సెంటర్ల అద్దెలు, టీఏ, డీఏలు చెల్లించాలి. – సౌజన్య, శ్రీకాళహస్తి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు

10వ తేదీ సెక్టార్ మీటింగ్ అంట!



అంగన్‌వాడీ చరిత్రలో ఎప్పుడూ 10వ తేదీ సెక్టార్ మీటింగ్ నిర్వహించలేదు. ప్రతి నెలా 25వ తేదీ తర్వాతే నిర్వహించేవారు. విజయవాడలో 10వ తేదీ జరిగే ధర్నాకు వెళ్లకుండా అదే రోజు సెక్టార్ మీటింగ్ నిర్వహిస్తున్నారు. న్యాయమైన కోర్కెల కోసం పోరాటం చేస్తే తప్పేముంది. –రాజేశ్వరి, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి (సీఐటీయూ అనుబంధం)

బెదిరింపులకు దిగడం సరికాదు



న్యాయమైన కోర్కెల సాధన కోసం ప్రశాంతంగా ధర్నా చేస్తామని ముందే అధికారులకు తెలియజేశాం. అయితే ధర్నాకు వెళ్లడం నేరంగా భావించి ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదు. అంగన్‌వాడీలకు పని ఒత్తిడి పెరిగింది. వేతనం రూ.26వేలు చెల్లించాలి.– పద్మలీలా, అంగన్‌వాడీ వర్కర్స్ జిల్లా అధ్యక్షురాలు(సీఐటీయూ)

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నెల 10వ తేదీన సెక్టార్ మీటింగ్ నిర్వహించనున్నాం. ధర్నాకు సంబంధించి అంగన్‌వాడీ నేతలు మాకు వినతిపత్రాన్ని అందించారు. బెదిరింపులు, ఒత్తిళ్లు లేవు. – వంసతబాయి, ఐసీడీఎస్, పీడీ

వైఎస్సార్‌సీపీలో చేరిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు


కాంగ్రెస్ నాయకుడు ఎంటెక్‌బాబుకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి

తిరుపతి మంగళం : ప్రతి పేదవాడికి మెండుగా సంక్షేమ పథకాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప నాయకుడు జగనన్న అని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎంటెక్ బాబు అన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద శనివారం సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోట రాజేష్ ఆధ్వర్యంలో చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ మద్దిల గురుమూర్తి, మేయర్ శిరీష సమక్షంలో ఆయన వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎంటెక్ బాబుకు కండువాను కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సత్యవేడులో రాజేష్ అన్న గెలుపుకోసం కృషి చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బీరేంద్రవర్మ, పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, సత్యవేడు నియోజకవర్గ మండల నాయకులు దయాకరరెడ్డి, భానుప్రకాష్‌రెడ్డి, గురునాథం, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

పెళ్లకూరు: నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి తాళ్వాయిపాడు గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున బెంగళూరు నుంచి గుడివాడ వెళుతున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సతీష్‌కుమార్(40) మృతి చెందాడు. స్థానిక ఎస్‌ఐ నాగరాజు కథనం మేరకు.. సతీష్‌కుమార్ తన స్నేహితురాలు శిరీషాతో కలిసి కారులో బెంగళూరు నుంచి గుడివాడకు వెళుతున్నారు. మార్గ మధ్యంలో తాళ్వాయిపాడు గ్రామం వద్ద ప్రమాద వశాత్తు కారు డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సతీష్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సతీష్‌కుమార్ మృతి చెందాడు. రక్త గాయాలైన శిరీషాను నెల్లూరు తరలించారు. మృతునికి భార్య రేణుక, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రావెల్ బస్సును ఢీకొట్టిన లారీ


మృతి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సతీష్‌కుమార్

నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మార్గంలో పెన్నేపల్లి గ్రామ సమీపంలో ఉన్న అరబిందో అపార్ట్‌మెంట్ వద్ద శనివారం తెల్లవారు జామును ఆగి ఉన్న ట్రావెల్ బస్సును లారీ ఢీట్టింది. ఈ ఘటనలో పర్విన్ అనే మహిళకు గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. బెంగళూరు నుంచి నెల్లూరుకు వెళుతున్న ఎస్‌వీడీటీ ట్రావెల్ బస్సు మార్గ మధ్యంలో పెన్నేపల్లి గ్రామ సమీపంలో అరబిందో అపార్ట్‌మెంట్ వద్ద ప్రయాణికుల కాలకృత్యాల నిమిత్తం రోడ్డు పక్కగా ఆగింది. అదే మార్గంలో వెళుతున్న లారీ ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న పర్విన్‌కు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన పర్విన్‌ను చికిత్సల నిమిత్తం నాయుడుపేటకు తరలించారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


మహిళా ఉద్యోగలను సత్కరించిన ఉన్నతాధికారులు


ఫొటోలు దిగుతున్న డీపీఓ సుశీలాదేవి, సర్పంచ్ ఫాజిలా

చంద్రగిరి: రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో మహిళలు రాణించాల్సిన ఆవశ్యకత ఉందని చిత్తూరు జిల్లా జెడ్పీ సీఈఓ రవి కుమార్ నాయుడు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం మండలంలోని ఐతేపల్లి, అగరాల పంచాయతీ సర్పంచ్‌లు ఫాజిలా, అగరాల భాస్కర్ రెడ్డిల అధ్యక్షతన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా ఐతేపల్లి ఎంపిక కావడం శుభపరిణామమన్నారు. అనంతరం మహిళా డిజిటలైజేషన్, ఇన్నోవేషన్ టెక్నాలజీలో మహిళల పాత్ర గురించి వివరించారు. తర్వాత మహిళలను వారు ఘనంగా సత్కరించారు. డీపీఓ సుశీలాదేవి, ఎంపీడీఓ శేఖర్, ఎంఈఓ లలితకుమారి, ఈఓఆర్డీ వెంకటరత్నం, ఏపీఎం గంగయ్య, మెడికల్ అధికారిణి డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

15 నుంచి ఇంటర్ మూల్యాంకనం

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని ఎస్వీ జూనియర్ కళాశాలలో ఈ నెల 15వ తేదీ నుంచి ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు సంబంధించి స్పాట్ వాల్యుయేషన్ చేపట్టనున్నట్లు ఆర్‌ఐవో జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇది వరకే సంస్కృతం సబ్జెక్టుకు సంబంధించి మూల్యాంకనం చేపట్టినట్లు తెలిపారు. 15వ తేదీ నుంచి సబ్జెక్టుల మూల్యాంకనానికి ఇంటర్ బోర్డు నుంచి అధ్యాపకులకు ఉత్తర్వులు రానున్నాయని తెలిపారు. ఉత్తర్వులు అందుకున్న ప్రతి అధ్యాపకుడు విధిగా స్పాట్ వాల్యుయేషన్‌కు హాజరుకావాలని కోరారు.

గూడ్స్ రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన మణెయ్య

నాయుడుపేట టౌన్: నాయుడుపేట రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం రైలు పట్టాలు దాటుతున్న కాపులూరు మణెయ్య(48) అనే వ్యక్తిని గూడ్స్ రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సూళ్లూరుపేట రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కథనం.. కల్లిపేడు గ్రామానికి చెందిన ఎలక్ట్రీషియన్ కాపులూరు మణెయ్య, భార్య పిల్లలతో కలిసి మండల పరిధిలోని చిగురుపాడు గ్రామంలో నివాసం ఉంటున్నారు. శనివారం మణెయ్య రైల్వే స్టేషన్ చివరి ప్లాట్‌ఫారమ్ నుంచి నడుచుకుంటు వెళ్లి రైలు పట్టాలు దాటుతున్నాడు. చెన్నై వైపు వెళ్లే గూడ్స్ రైలు అతనిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

మార్చి 31 వచ్చేస్తోంది?

–మీ టార్గెట్ పూర్తి చేశారా?


డీఎంలు, ఏడీఎంలతో సమీక్షిస్తున్న ఈడీలు

తిరుపతి అర్బన్: 'మార్చి 31 వచ్చేస్తోంది.. మీ డిపో టార్గెట్ పూర్తి చేశారా..? అంటూ విజయవాడ, కడప ఈడీలు అప్పలరాజు, చంద్రశేఖర్ డిపోల వారీగా సమీక్షించారు. శనివారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను పరిశీలించిన అనంతరం డీపీటీవో కార్యాలయంలో రాబడిపై డిపో అధికారులతో సమీక్షించారు. ఇప్పటి వరకు వచ్చిన రాబడి రూ.535 కోట్లు మాత్రమేనని గుర్తుచేశారు. డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, డీఎంలు మునిచంద్ర, భాస్కర్, ప్రశాంతి, అసిస్టెంట్ డీఎంలు, మెకానిక్ అసిస్టెంట్లు చాందిని, పుష్పలత పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీ నియామకం

తిరుపతి మంగళం : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన నాయకులను వివిధ హోదాలలో నియమించారు. రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గా బత్తల గీతాయాదవ్, ప్రధాన కార్యదర్శులుగా పీవీ.గాయత్రీదేవి, పీ.దాక్షాయని, అఫిషియల్ స్పోక్స్‌పర్సన్‌గా కమలాపురం శ్రీదేవిరెడ్డి, రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శులుగా ఎం.జయరాం, వీ.సరస్వతమ్మ, కోడూరు కల్పలతారెడ్డి, ఊడూరు యమునమ్మ, కురుగుండ ధనలక్ష్మి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శులుగా పీ.శేఖర్ మద్దాలి, తులసీయాదవ్, జీ.కృష్ణమూర్తి, కే.సదాశివయ్య, కే.అమరనాథ్, ఎస్.వెంకటరమణ, రాష్ట్ర బీసీ సెల్ అఫిషియల్ స్పోక్స్‌పర్సన్ టీ.వెంకటేశ్వరరావు (లవ్లీ వెంకటేష్), రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శులుగా బీ.వెంకటరమణయ్య, కే. శ్రీనివాసులు, ఎం.సుబ్రమణ్యం, జీ.గోపాల్‌యాదవ్, రాష్ట్ర వన్యవిభాగం ప్రధాన కార్యదర్శులుగా ఆర్.గుణశేఖరరెడ్డి, కేఎం.సత్యనారాయణ, కార్యదర్శులుగా టీ.మధుసూదన్‌రెడ్డి, ఎల్.శ్రీకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా డీ.భక్తవత్సలం, కే.ఉమామహేశ్వరరెడ్డి, ఏ.అన్నాదొరై, రాష్ట్ర ఇంటెలెక్టుల్స్ ఫోరం కార్యదర్శులుగా పీ.జగదీశ్వర్‌రెడ్డి, చిరంజీవిరెడ్డి పట్టుబాలను నియమించారు.